## క్లుప్తంగా

### గ్రంథాలయంలో చదరంగం పోటీలు



విద్యార్థులకు నీతి కథలు గురించి వివరిస్తున్న దృశ్యం

**చాగల్లు:** స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు నీతి కథలు, వేమన పద్యాల గురించి వివరించినట్టు గ్రంథాలయాధికారి గద్దె శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులతోయోగ ఆసనాలు చేయించారు. ఆటవిడుపుగా చదరంగం, క్యారంస్ పోటీలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్టు శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులు ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### ముగిసిన కల్యాణోత్సవాలు



మహాపూర్ణాహుతి చేస్తున్న వేదపండితులు

**నల్లజర్ల:** గత మూడు రోజులుగా జరుగుతున్న అనంతపల్లిలోని ఆనంద తిరుమల వేంకటేశ్వరుని వార్షిక కల్యాణోత్సవాలు గురువారం పూర్ణాహుతితో ముగిశాయి. గురువారం ఉదయం పూర్ణాహుతి, చక్రస్నానం, శ్రీపుష్ప యాగం (పవళింపుసేవ)కార్యక్రమాలు వేదపండితులు పెదపూడి విజయ వెంకటరమణ, ఆలయ అర్చకులు అగ్రిహోత్రం వెంకటేష్, మదనగోపాలస్వామి ఆలయ అర్చకులు దివిపాండు రంగ శర్మ ఆధ్వర్యంలో జరిగాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు

**తాళ్లపూడి:** అన్నదేవరపేట ఆర్‌సీఎం చర్చి వద్ద ఆలయ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏలూరు పీఠం వికారి జనరల్ రెవరెండ్ ఫాదర్ పీ బాల పూజ బలి నిర్వహించారు. అనంతరం ఫాదర్ బాల, తల్లి ఔన్నత్యం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫాదర్స్ ఎలియస్, దిలీప్, బేతాళ రాజేష్, పలువురు గురువులు పాల్గొన్నారు.

### ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

**నిడదవోలు రూరల్:** ఉపాధి పనులు చేసే కూలీలకు పని ప్రదేశాలకు కనీస సౌకర్యాలు కల్పించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని సమిశ్రగూడెం, సింగవరం గ్రామాల్లో ఉపాధి కూలీల సమస్యలను గురువారం ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కూలీలకు ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని, కనీస వేతనాన్ని పెంచాలని, పని ప్రదేశాల్లో షామియానా, మజ్జిగ, తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. నాయకులు గెద్దం రవీంద్రబాబు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

### ముత్యాలమ్మ జాతర ప్రారంభం



ముత్యాలమ్మ అమ్మవారు

**నిడదవోలు రూరల్:** సింగవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను గురువారం ఘనంగా ప్రారంభించారు. శుక్రవారం అమ్మవారి గ్రామ సేవ, జూన్ ఒకటిన బలిచేట, సాంస్కృతిక కార్యక్రమాలు, 2న అమ్మవారికి నైవేద్యాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ముత్యాలమ్మ జాతరతో గ్రామమంతా బంధువులతో కళకళలాడుతోంది.

### అన్నసమారాధన

**చాగల్లు:** బ్రాహ్మణగూడెంలో వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో గురువారం అన్న సమారాధన జరిగింది. స్వామివారి ఆరాధన ఉత్సావాలు ముగింపులో భాగంగా ఈ అన్నసమారాధనను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### నేడు మండల పరిషత్ సమావేశం

**దేవరపల్లి:** స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు. అనంతరం ఎంపీడీఓ కృష్ణంరాజు పదవీ విరమణ సందర్భంగా అభినందన సభ జరుగుతుందని దుర్గారావు తెలిపారు.

# ఉద్యానవనం.. ఉపాధికి ఊతం

- రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో మొక్కల పెంపకం
- మండలానికి 200 ఎకరాలలో అమలు
- గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న అధికారులు



రెండేళ్ల క్రితం ఉపాధి హామీలో వేసిన నిమ్మతోట

**నల్లజర్ల:** రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు నూరుశాతం సబ్సిడీతో ఉద్యాన తోటల పెంచేందుకు చర్యలు చేపట్టారు. మండలానికి 200 ఎకరాలలో ఉద్యాన తోటలు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించారు. అందుకు క్షేత్ర స్థాయిలో సిబ్బంది వెళ్లి రైతులను గుర్తించే ప్రక్రియలో ఉన్నారు. వచ్చే నెలలో వర్షాలు పడితే మొక్కలు నాటనున్నారు. ఐదెకరాల లోపు సన్న, చిన్నకారు రైతులందరూ ఈ పథకానికి అర్హులే, అందరూ వినియోగించుకోవచ్చు. మామిడి, జీడిమామిడి, బత్తాయి, నిమ్మ, తైవాన్ జామ, దానిమ్మ, నేరేడు, కొబ్బరి, సపోటా, సీతాఫలం, డ్రాగన్‌ఫ్రూట్ తదితర తోటలు వేసుకోవచ్చు. నూరుశాతం సబ్సిడీ ఉంటుంది. మొక్కలు కొనుగోలు రైతులే స్వయంగా చేసుకోవచ్చు. బిల్లు సమర్పిస్తే ఆ డబ్బులు రైతుకు అందజేస్తారు. లేదా ఉపాధి హామీ అధికారులనే మొక్కలు అందజేయమని కోరవచ్చు. ఈ మొక్కలన్నీ కడియం నర్సరీలో తీసుకోవచ్చు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఏడాది పెద్ద ఎత్తున ఉద్యాన తోటలు పెంచాలని ప్రతిపాదనలు తయారు చేశారు. ఏపీఓ, ఈసీ, సాంకేతిక క్షేత్రసహాయకులకు బాధ్యతలు అప్పగించారు. ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి వారికి అవగాహన కల్గించే కార్యక్రమాలు చేపడుతున్నారు.

**పథకం మంజూరైతే..**

ఉపాధి హామీ పథకంలో మంజూరైతే రైతులు దుక్కులు మొదలు, మొక్కలకు గుంతలు తీయడం, నర్సరీల నుంచి మొక్కలు తీసుకొచ్చి నాటడం వంటి పనులు చేసుకోవాలి. ఎకరానికి 70 మొక్కలు చొప్పున అందిస్తారు. వాటిని మూడు అడుగుల లోతు గోతులు తవ్వి మొక్కలు నాటుకోవాలి. రవాణా చార్జీలు, కలుపు తీయడం, ఎరువులు, పురుగుల మందుల ఖర్చులు, నీటి వినియోగ ఖర్చులు కూడా ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రైతు బ్యాంకు అకౌంట్‌లో జమ చేస్తుంది. మూడేళ్లకు పంట రైతు చేతికి వస్తుంది. ఆయా పంటలను బట్టి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రైతుకు అందుతుంది.

**మునగకు అధిక ప్రాధాన్యం**

ఔషధగుణాలు కలిగిన మునగ తోటలు పెంపకానికి అధికారులు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఎకరాకు రూ.35వేలు చొప్పున రెండేళ్లపాటు రూ.70వేలు సబ్సిడీగా వర్తిస్తుంది. పండిన పంట రైతుకు అదనపు ఆదాయంగా ఉంటుంది. అంతేకాకుండా మునగలో ఉన్న ఔషధగుణాలు ఎక్కువగా ఉంటాయని, అపారమైన పొటాషియం, కాల్షియం, ప్రొటీన్లు, జింకు, ఖనిజలవణాలు సమృద్ధిగా లభిస్తాయని చెబుతున్నారు. ఇవి గుండె, క్యాన్సర్, మధుమేహం తదితర వ్యాధుల నివారణకు దివ్య ఔషధంగా పనిచేస్తోంది. అందుకే అధికారులు ఈ పంటకు ప్రాధాన్యమిస్తున్నారు.

> **ఖర్చు ప్రభుత్వందే..**
>
> 
>
> ఉపాధి హామీ పథకంలో నూరు శాతం సబ్సిడీపై ఇస్తున్న ఉద్యాన పండ్ల తోటల పథకాన్ని చిన్న, సన్నకారు రైతులు వినియోగించుకోవాలి. పెట్టుబడి ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. ఆసక్తి ఉన్న రైతులు గ్రామ సచివాలయాలలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను గాని మండల స్థాయిలో ఉన్న ఉపాధి కార్యాలయంలో గాని సంప్రదించాలి.
>
> –టి.వెంకట్రావు, ఏపీఓ, నల్లజర్ల

### పచ్చిరొట్ట ఎరువుతో అధిక దిగుబడి

**నల్లజర్ల:** పంట దిగుబడి బాగుండాలంటే ఆ మట్టి సారవంతమైనదే కాకుండా పోషకాలు కలిగి ఉండాలనే ఉద్దేశంతోనే జీలుగ, జనుము, పిల్లపెసర వంటి పచ్చిరొట్ట ఎరువులు వేయాలని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ తెలిపారు. పూతదశకు రాగానే ఆ మొక్కలను మట్టితో కలియదున్నాలన్నారు. తద్వారా నేల సారవంతం అవుతుందన్నారు. అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువులైన పిల్లిపెసర, జనుము, జీలుగ తదితర విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు 50 శాతం సబ్సిడీపై విత్తనాలను అందజేస్తున్నట్టు చెప్పారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ జీరాక్స్ కాపీలు అందజేసి విత్తనాలు పొందవచ్చని తెలిపారు.

**సేంద్రియ కర్బనం పెరగాలంటే..**

ప్రస్తుతం పంట భూములలో సేంద్రియ కర్బన శాతం బాగా పడిపోయిందన్నారు. దీనిని పెంచుకోవడానికి పచ్చిరొట్ట విత్తనాలు వేయాలన్నారు.పచ్చిరొట్ట పైరును పూతదశలో మొక్కలతో పాటు కలియదున్నడంతో అధిక ప్రయోజనాలు పొందవచ్చునన్నారు.నేలలో నత్రజని స్థాపన జరిగి సారవంతం చేయడానికి ఉపకరిస్తాయన్నారు. నేలలో సేంద్రియ కర్బన శాతం పెరుగుతుందన్నారు. తద్వారా రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుందన్నారు. తెగుళ్ల నివారణకు అవకాశం ఉంటుందన్నారు. రసాయన ఎరువుల కోసం పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు.

# ఉత్సాహంగా వేసవి శిక్షణ



ఇంగ్లిష్ స్టోరీ రీడింగ్‌లో విద్యార్థులు

**నిడదవోలు :** గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగుతులు ఉత్సాహంగా జరుగుతున్నాయి. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులలో భాగంగా గురువారం విద్యార్థులకు ఇంగ్లిష్ స్టోరీలను చదివించారు. భారత స్వాతంత్ర్య సమయోధులైన బాలగంగాధర్ తిలక్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సరోజిని నాయుడు జీవిత చరిత్రలను వివరించారు. సెలవుల్లో ఆటపాటలతో గడిపే చిన్నారులకు గ్రంథాలయాధికారి కుంచే చినబాబు ఆధ్వర్యంలో చదువుతో పాటు వివిధ రకాల అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. చిన్నారులకు తెలుగు పద్యాలు, చందమామ కథలు, శతక పద్యాలు, ఆటపాటలను నేర్పిస్తున్నారు. కుందుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

**నిడదవోలు రూరల్:** తాడిమళ్ల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కొనకళ్ల నాగేశ్వరరావు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ గురువారం తెలిపారు. నాగేశ్వరరావు వద్ద 24 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనపర్చుకున్నామన్నారు.

### మద్యం సీసాలతో...

**దేవరపల్లి:** స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని నల్లజర్ల మండలం చోడవరంలో గురువారం దాడులు నిర్వహించినట్టు సీఐ కె.వి.స్వామి తెలిపారు. దాడుల్లో 10 మద్యం సీసాలతో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు. ముగ్గురు పాత ముద్దాయిలను దేవరపల్లి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. దాడిలో ఎస్సై పి. సుధీర్, సిబ్బంది పాల్గొన్నట్టు ఆయన తెలిపారు.

# కృష్ణబాబు కుటుంబానికి ప్రముఖుల పరామర్శ



దొమ్మేరులో మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**కొవ్వూరు:** ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ కేంద్ర పాలక మండలి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు కుటుంబ సభ్యులను నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు గురువారం పరామర్శించారు. గురువారం దొమ్మేరు గ్రామంలోకి వెళ్లి శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజు, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, జెడ్పీటీసీ సభ్యు రాలు బొంత వెంకటలక్ష్మి, నాయకులు గారపాటి వెంకటకృష్ణ, కంఠమణి రమేష్, తాళ్లపూడి మాజీ ఎంపీపీ కొమ్మిరెడ్డి వీరాఘమమ్మ, నాయకులు పరిమి సోమరాజు, బొల్లిన సతీష్, కొవ్వూరు ఎంపీపీ కాకర్ల నారాయుడు తదితరులు కృష్ణబాబు చిత్రపటానికి పూలు వేసి నివాళుల అర్పించారు. కృష్ణబాబు అల్లుడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణను, సోదరుడు ఆంధ్రా షుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు.

# పాల ప్యాకెట్ కోసం వెళ్లి..

**కళ్లముందే తండ్రి విగతజీవిగా పడి ఉండటాన్ని ఆ పసి హృదయం తట్టుకోలేకపోయింది. ఉబికి వస్తున్న దుఃఖం.. వచ్చీరాని మాటలతో నాన్నను.. లేపేందుకు ప్రయత్నిస్తూ గుండెలవిసేలా రోదించాడు. ఆ చిన్నారి గోసను చూసి స్థానికులు కళ్లు చెమర్చారు. ఈ విషాద సంఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.**

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం
- మృతదేహం వద్ద విలపించిన రెండేళ్ల కుమారుడు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కనకప్రసాద్, చిత్రంలో రోదిస్తున్న కుమారుడు

**అబ్దుల్లాపూర్‌మెట్ (రంగారెడ్డి జిల్లా):** జీవనోపాధి కోసం సొంత ఊరును విడిచి నగరానికి వచ్చాడు. భార్యాపిల్లలతో జీవితం సాఫీగా సాగుతోందని భావించాడు. కానీ రోడ్డు ప్రమాదం అతని ఆశల్ని చిదిమేసింది. రెండేళ్ల కుమారుడితో కలిసి పాల ప్యాకెట్ కోసం బయటకు వెళ్లిన వ్యక్తిని అతి వేగంతో వచ్చిన వాహనం బలికొంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు మండలం అత్తివాడులు గ్రామానికి చెందిన శెట్టి కనకప్రసాద్(35) తన భార్య పిల్లలతో కలిసి మండలంలోని ఇనాంగూడలో ఉంటూ ప్రైవేటు జాబ్ చేస్తున్నాడు. గురువారం ఉదయం 7 గంటలకు పాల ప్యాకెట్ కోసం తన ద్విచక్ర వాహనంపై రెండేళ్ల కుమారుడు శివకుమార్‌ను వెంట తీసుకుని అబ్దుల్లాపూర్‌మెట్ కూడలికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఇనాంగూడ కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి వస్తున్న ఓ డీసీఎం అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కనకప్రసాద్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, అతని కుమారుడు శివకుమార్‌కు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

**గుండెలవిసేలా రోదించిన బాలుడు**

తనతో ముచ్చటిస్తూ వచ్చిన తన తండ్రి రోడ్డుపై విగతజీవిగా పడి ఉండడంతో.. ఏం జరిగిందో తెలియని చిన్నారి తండ్రి మృతదేహం పక్కనే కూర్చుని.. దిక్కులు చూస్తూ గుక్క పెట్టి ఏడ్చాడు. ఇది చూసిన వారు కన్నీటి పర్యంతమయ్యారు. ఇంట్లోంచి బయటకు వెళ్లిన కొన్ని నిమిషాల్లోనే భర్త తనకు దూరమయ్యాడని సంఘటనా స్థలంలో మృతుడి భార్య గుండెలవిసేలా రోదించింది.

# ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



కొవ్వూరు జరిగిన వేడుకల్లో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

**కొవ్వూరు:** సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్(సీఐటీయూ)54వ ఆవిర్భావ దినోత్సవం గురువారం కొవ్వూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు.బ స్టాండ్ సెంటర్ ఆ సంఘం అధ్యక్షుడు మద్దుకూరి దొరయ్య సంఘ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఎం.సుందరబాబు మాట్లాడుతూ ఐక్యతా–పోరాటం నినాదంలో 1970 మే 30 దేశ వ్యాప్తంగా ఏర్పడిన అతిపెద్ద కార్మిక సంఘం సీఐటీయూ అన్నారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం సీఐటీయూ పోరాటం సాగిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణలో సీఐటీయూ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సమాన పనికి సమాన వేతనం కోసం పోరాటాలు చేసిందన్నారు. మైగాపుల నాగేశ్వరరావు, మానికిరెడ్డి హరిబాబు, జొన్నల రాంబాబు, నందం కొండబాబు, దూడల ధనుజయ్, వర్రే అర్జునరావు, డోలా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సీపెట్ కోర్సులకు 2 వరకూ దరఖాస్తుల స్వీకరణ

**నల్లజర్ల:** భారత ప్రభుత్వ విద్యా సంస్థ అయిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్, టెక్నాలజీ(సీపెట్)లో డిప్లమో కోర్సులకు వచ్చే నెల 2వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఆ సంస్థ జాయింట్ డైరక్టర్, హెడ్, సీహెచ్ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు మూడేళ్ల కాల వ్యవధిలో డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే, బీఎస్సీ విద్యార్థులకు రెండేళ్ల కాల పరిమితితో పోస్టుగాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సులు ఉన్నాయని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు కళాశాల ప్రాంగణంలోనే విడివిడిగా హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. ఈ కోర్సులలో ప్రవేశానికి వచ్చే నెల 9న విజయవాడ, అనంతపురాల్లో ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిభ ఆధారంగా విజయవాడ కేంద్రంలో 150 సీట్లు భర్తీ చేస్తామన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్లాస్టిక్ రంగంలోని బహుళజాతి సంస్థల్లో రూ.16,000, రూ.20,00 ప్రారంభ వేతనంతో ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. జూనియర్ ఇంజినీర్ (ప్రొడక్షన్), మౌల్డ్ డిజైనర్, మేకర్, జూనియర్ ఇంజినీర్ (మెయింటెనెన్స్), క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో ఇన్‌స్పెక్టర్ వంటి ఉద్యోగాలకు అవకాశాలు ఉంటాయని వివరించారు. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, వివరాలకు 93980 50255 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలి

**కంబాలచెరువు:** త్వరలో ఏర్పాటు కానున్న కేంద్ర ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రతినిధులు కోరారు. అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గోకవరం బస్టాండ్ వద్దనున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల దేశంలోనూ, రాష్ట్రంలోనూ న్యాయవాదులపై దాడులు జరగడం చాలా దారుణమన్నారు. ఎల్లప్పుడూ న్యాయ పరిరక్షణకు కృషి చేసే న్యాయవాదులకు రక్షణ లేకపోతే, సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. త్వరలో రానున్న ప్రభుత్వం పార్లమెంట్‌లో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని చేయాలని కోరారు. సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాశి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్యులకు మాదిరిగా న్యాయవాదులకూ రక్షణ చట్టం అవసరమన్నారు. దీని సాధనకు ఎటువంటి పోరాటానికైనా సిద్ధమన్నారు. సొసైటీ రాష్ట్ర సహ కార్యదర్శి బీర అరుణ్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో, ప్రభుత్వ పరిపాలనలో న్యాయవాదులదే కీలక పాత్ర అన్నారు. అటువంటి న్యాయవాదులకు రక్షణ లేకపోవడం శోచనీయమన్నారు.

# ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ఉదయ బ్రహ్మాం

**కంబాలచెరువు (రాజమహేంద్రవరం):** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా రాజమహేంద్రవరానికి చెందిన ఏ.ఉదయబ్రహ్మాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుడివాడలో గురువారం జరిగిన సంఘ జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. రెండోసారి ఉదయబ్రహ్మాం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికావడంపై సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, అధ్యక్షుడు కె.డేవిడ్ లివింగ్‌స్టన్, జిల్లా గౌరవాధ్యక్షుడు వరుల అప్పయ్యశాస్త్రి, రాజమహేంద్రవరం నగర శాఖ అధ్యక్షుడు తాతారావు, ప్రధాన కార్యదర్శి ఎన్‌జీ శంకర్ తదితరులు అభినందనలు తెలిపారు.

# కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు



సమీక్షలో మాట్లాడుతున్న అడిషనల్ డీజీపీ శంఖబ్రత బాగ్చీ, చిత్రంలో మూడు జిల్లాల ఎస్పీలు

- సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా పెట్టండి
- మూడు జిల్లాల ఎస్పీల సమీక్షలో అడిషనల్ డీజీపీ శంఖబ్రత బాగ్చి

**కంబాలచెరువు(రాజమహేంద్రవరం):** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర అడిషనల్ డీజీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మూడు జిల్లాల ఎస్పీలతో రాజమహేంద్రవరం జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం రాత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై ప్రత్యేక నిఘా అవసరమన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకూ నిరంతరం వాహన తనిఖీలు, మాక్ డ్రిల్స్, ఫ్లాగ్‌మార్చ్‌లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాల పోలీసు యంత్రాంగమంతా నిష్పక్షపాతంగా పనిచేసి, పోలీసుల గౌరవాన్ని పెంచాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని విధాలా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్, పాత ఎలక్షన్ నిందితులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎలక్షన్ కేసులపై పురోగతిని సాధించాలన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా, ఎన్నికల సంఘ నిబంధనలను ఉల్లంఘించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే రౌడీషీట్ కూడా తెరుస్తామన్నారు. సమావేశంలో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్,, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ పి.జగదీష్, కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, కోనసీమ జిల్లా ఎస్పీ శ్రీధర్, మూడు జిల్లాల అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు పాల్గొన్నారు.

# జలకాలాడుతూ.. సేద తీరుతూ..



విజ్జేశ్వరం కాటన్ బ్యారేజీ దిగువున స్నానాలు చేస్తున్న జనాలు



విజ్జేశ్వరం కాటన్ బ్యారేజీ దిమ్మల పైనుండి నీటిలోకి దూకుతున్న యువత

- ఎండలకు తాళలేక నదీ స్నానం చేస్తున్న జనం
- ప్రమాదమని తెలిసినా బేఖాతారు

**నిడదవోలు:** ఎంటలకు తాళలేక జనం గోదావరి స్నానం చేస్తూ సేదతీరుతున్నారు. గోదావరి నీటి మట్టం తగ్గడంతో బ్యారేజీ కిందకు దిగి మరీ జలకాలాడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జనం స్నానం చేస్తూనే ఉన్నారు. దీంతో బ్యారేజీల వద్ద సందడి వాతావరణం నెలకొంటోంది. బ్యారేజీ కింద నాచుపట్టి జారిపడే అవకావం ఉందని తెలిసినా ఖాతరు చేయడం లేదు. వేసవిలో సూరీడు చుర్రుమంటూ నిప్పులు చెరగడంతో ఉక్కపోతను భరించలేక ప్రజలు నదులు, కాలువల్లో స్నానాలు చేస్తూ ఉపశమనం పొందుతున్నారు. ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో చిన్న పెద్ద అంతా నదీ స్నానంపై ఆసక్తి చూపుతున్నారు.

**సరదాగా ఉన్నా...**

గోదావరి నీటిమట్టం అధికంగా ఉన్న సమయంలో ఇరిగేషన్ అధికారులు గోదావరి బ్యారేజీల సామర్థ్యం మేరకు మిగులు జలాలను సముద్రంలోకి వదులుతున్నారు. ఇలా వదలని పక్షంలో బ్యారేజీ గేట్లకు ప్రమాదం పొంచి ఉంటుంది. దీంతో బ్యారేజీ గేట్లను ఎత్తి మిగులు జలాలను దిగువకు వదులుతున్నారు. ఇలా వదులుతున్న జలాలలో ప్రజలు స్నానాలు చేస్తూ గడుపుతున్నారు. నిడదవోలు మండలం విజ్జేశ్వరం కాటన్ బ్యారేజీ, కొవ్వూరు మండలం మద్దూరు కాటన్ బ్యారేజీ, బొబ్బర్లంక, ధవళేశ్వరం కాటన్ బ్యారేజీల సామర్థ్యం మేరకు అధికంగా ఉన్న గోదావరి జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో జనాలు తరలివచ్చి స్నానాలు చేస్తున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పోలీసులు హెచ్చరిస్తూ ఏమాత్రం ఖాతరు చేయడం లేదు.